సాక్షి
సిద్దిపేట
గురువారం । 25 । జూలై । 2024



ప్రాజెక్టులిలా.. వరదొస్తే ఎలా?

ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు మరమ్మతులకు నోచుకోవడంలేదు. సాగునీరు పారడం లేదు. వివరాలు 8లో ▸



ఘనంగా బోనాల ఉత్సవాలు

పలుచోట్ల బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారుల ఆలయాల్లో భక్తులసందడి నెలకొంది. వివరాలు 9లో ▸



మహిళల అభివృద్ధికి రుణాలు

మహిళల అభ్యున్నతికి రుణాలు అందిస్తామని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ హన్మంతరెడ్డి తెలిపారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ యాస్మిన్ బాషకు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా పట్టు రైతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా పట్టు రైతుల సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలోని రాష్ట్ర కమిషనర్ షేక్ యాస్మిన్ బాషకు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు గూళ్లకు ఇతర రాష్ట్రాల్లోని మార్కెట్లతో పోలిస్తే ఇక్కడ ధర తక్కువగా ఉందని, దీంతో రైతుల నష్టపోతున్నారన్నారు. సరైన ధర రైతులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విన్నవించామన్నారు. పట్టుగూళ్లు అమ్మిన రోజే ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ డబ్బులను సైతం అందేలా చూడాలని కోరామన్నారు. పట్టు పురుగులకు వినియోగించే మందులను, పరికరాలను సబ్సిడీపై రైతులకు అందించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలోని మర్కూక్ పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బాలరాజ్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఏ రూల్స్ అతిక్రమించడమేకాకుండా క్రమశిక్షణ రహితంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారణ అనంతరం అతడిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. క్రమశిక్షణ రహితంగా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందిని ఉపేక్షించేది లేదన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారం వ్యాస మహర్షి యోగా సొసైటీ సభ్యులు తోట అశోక్, రాములు, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ధ్యాన మందిరంలో ఉదయం 5.30 గంటలకు తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, స్థూలకాయం, థైరాయిడ్, వివిధ రకాల నొప్పులు, నిద్రలేమి, ఏకాగ్రత లోపం మొదలగు సమస్యలకు ఈ యోగా శిక్షణ కార్యక్రమం పరిష్కారం చూపుతుందన్నారు. పట్టణ ప్రజలు ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ విధానాలను ఎండగడతాం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగడతామని అన్నారు. ఆరునెలల కిందటి వరకు దేశంలోనే ఒకటి, రెండు స్థానాల్లో నిలిచిన తెలంగాణ నేడు కాంగ్రెస్ పాలనలో అధోగతి పాలయ్యిందన్నారు. రైతులకు వెంటనే పెట్టుబడి సాయం అందించడమేకాకుండా రుణమాఫీని వంద శాతం అమలుచేయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి పనిచేస్తారని బీజేపీకి 8, కాంగ్రెస్‌కు 8, ఎంఐఎంకు మరో సీటును అందిస్తే...ప్రజల ఆశలు అడియాసలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

అమిత్‌షాతో రఘునందన్




దుబ్బాక: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను బుధవారం ఢిల్లీలో ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెదక్ లోక్‌సభ పరిధిలోని పలు అంశాలపై చర్చించినట్లు ఎంపీ సాక్షికి ఫక్షన్‌లో తెలిపారు. పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు.

భలే సీతాసోకుచిలుకలు

రంగురంగుల సీతాకోకచిలుకలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కలెక్టరేట్ ఆవరణలో నాటిన పూలమొక్కలపై సీతాకోకచిలుకలు వాలి కనువిందు చేస్తున్నాయి. పూలలోని మకరందాన్ని పీల్చుతూ కమనీయంగా దర్శనమిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, సిబ్బంది వాటిని తిలకించి ఆనందంతో పరవశించిపోతున్నారు.

–సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట











మాఫీ.. మాకేది?

- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- రూ.లక్ష వరకు రుణమాఫీ అయ్యింది 53వేల మందికే..
- కాలేదంటూ 631 మందికిపైగా ఫిర్యాదులు
- రైతు వేదికల్లో సహాయ కేంద్రాల ఏర్పాటు
- కానరాని పరిష్కార మార్గాలు



హుస్నాబాద్ రైతు వేదికలో ఆన్‌లైన్ పోర్టల్‌లో పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఏమీ చెప్పలేమంటున్నారు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు దగ్గుల రాజయ్య. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌కు చెందిన ఈ రైతుకు 1.04 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2013లో ఎస్‌బీఐ(ఏడీబీ) శాఖలో పంట రుణం తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా రుణాన్ని రెన్యూవల్ చేస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో రెన్యూవల్ చేసే సమయంలో రూ. 63,800 రుణం ఉంది. ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష లోపు రుణ మాఫీ కాలేదు. అధికారులను అడిగితే ఇంకా 15 రోజుల వరకు ఏం చెప్పలేమని సమాధానం చెబుతున్నారని రాజయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రుణ మాఫీ చేయాలని కోరుతున్నారు.

హుస్నాబాద్ విశాల పరపతి సహకార సంఘంలో రూ.లక్ష వరకు రుణ మాఫీకి 575 మంది రైతులు ఉన్నారు. వీరికి రూ.3,31,25,694 మాఫీ కావాల్సి ఉంది. అయితే 308 మందికి (రూ.1,73,46,955) మాత్రమే మాఫీ అయింది. 267 మందికి కాలేదు. దీంతో రైతులు వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. మాఫీ అవుతుందా? కాదా? అని సహకార సంఘం అధికారులను అడుగుతున్నారు.

సాక్షి, సిద్దిపేట: పంట రుణ మాఫీ మాకేందుకు కాలేదంటూ రైతులు వ్యవసాయ అధికారులు, బ్యాంకులకు బారులు తీరుతున్నారు. జిల్లాలో 53వేల బ్యాంకు ఖాతాదారులకు రుణ మాఫీ అయింది. రూ.లక్ష లోపు ఉన్నా మాఫీ కానీ వారి వివరాలను పరిశీలించేందుకు, సేకరించేందుకు సహాయ కేంద్రాలను ఆయా రైతు వేదికలలో ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 631 మంది రుణ మాఫీ కాలేదని దరఖాస్తు చేశారు.

పోర్టల్‌లో చూపుతున్న కారణాలు..	రైతుల సంఖ్య
సమాచారం లేదని	112
చెల్లని ఆధార్ నంబర్	12
ఆధార్, బ్యాంక్ ఖాతా సరిపోలడం లేదు	94
కుటుంబ సమూహాలు..	105
రేషన్ కార్డు లేదు	51
సర్వీస్ పెన్షన్ ఉన్న కుటుంబాలు	14
ప్రభుత్వ ఉద్యోగం ఉన్న కుటుంబాలు	16
వేరు వేరు వ్యక్తులకు ఒకే ఆధార్	14
ఇతర కారణాలు	213

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసే రైతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

రూ.290 కోట్లు మాఫీ

జిల్లా వ్యాప్తంగా 50,295 రైతు కుటుంబాల్లో 53,137 బ్యాంక్ ఖాతాదారులకు రూ.290,24,28,954 రుణ మాఫీ చేసింది. రెండో విడతలో రూ.1.5లక్షల వరకు, మూడో విడతలో రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేయలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు సైతం కొందరికి మాఫీ కాలేదు. దీంతో అవుతుందా కాదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆధార్ నంబర్ ఆధారంగా..

జిల్లాలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలకు వచ్చిన వారి రైతు ఆధార్ నంబర్ల ఆధారంగా వ్యవసాయాధికారులు యాప్‌లో తనిఖీ చేస్తుండగా రుణ మాఫీ తిరస్కరణకు కారణాలు వస్తున్నాయి. రైతు పేరిట తెల్ల కార్డు లేదని, ఆధార్‌లోని పేరుతో బ్యాంక్ ఖాతాలోని పేరు సరిపోలడంలేదని, అసలు రుణ ఖాతా సమాచారమే లేదని, పోర్టల్‌లో రైతు సమాచారం ఏమీ లేదని, అసలు కంటే వడ్డీ ఎక్కువ ఉందని, తెల్ల రేషన్ కార్డులో కుటుంబ వివరాలు లేవనే కారణాలను పోర్టల్‌లో చూపుతోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా 631 మంది పోర్టల్‌లో రైతులు ఫిర్యాదులు చేశారు.


మాఫీ కాలేదు..



రెండు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. 2021లో రూ.49,500 క్రాప్‌లోన్ తీసుకున్నా. అయితే రుణ మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే ఆధార్ కార్డులో ఉన్న పేరు, బ్యాంక్ రుణ ఖాతాలో ఉన్న పేరు వేరుగా ఉందని తెలిపారు. బ్యాంకు ఖాతాలో పేరును సరిచేయించుకోవాలన్నారు. రుణ మాఫీ చేయాలని కోరుతున్నా.

– గుద్దోళ మల్లేశం, రైతు, మిరుదొడ్డి

ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం



రూ.లక్ష లోపు రుణ మాఫీ కానీ రైతుల నుంచి ఫిర్యాదులను రైతువేదికల్లో స్వీకరిస్తున్నాం. రుణ మాఫీ కానీ రైతు ఆధార్ కార్డు తీసుకుని రైతు వేదికలో పోర్టల్‌లో చెక్ చేయించుకోవాలి. రుణ మాఫీ ఎందుకు కాలేదో తెలుస్తుంది. అర్హులు అయినా కానీ వారి ఫిర్యాదులు తీసుకుంటున్నాం. ప్రభుత్వం గైడ్‌లైన్స్ అనుగుణంగా జాబితాలను మళ్లీ పంపిస్తాం.

– మహేశ్, ఇన్‌చార్జి డీఏఓ

ఫలించిన 'సాక్షి' చొరవ

సమస్యల పరిష్కారానికి తోవ..

- ఫోన్ ఇన్‌లో వచ్చిన ఫిర్యాదులపై యుద్ధప్రాతిపదికన చర్యలు
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన పట్టణవాసులు

సాక్షి ఎఫెక్ట్



ధ్వంసమైన డ్రైనేజీ పైపునకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

గజ్వేల్: మున్సిపాలిటీ పరిధిలో 'వానాకాలంలో పారిశుద్ధ్యం నిర్వహణ–సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట' అంశంపై 'సాక్షి' నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నది. దీంతో పట్టణంలో సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు మొదలయ్యాయి. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములు వస్తున్నాయని, రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిలుస్తున్నాయని కాలనీకి చెందిన లక్ష్మీనర్సింహారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును నోట్ చేసుకున్న కమిషనర్ గొల్కొండ నర్సయ్య ఏఈ శ్రీధర్‌రెడ్డిని వెంట తీసుకొని బుధవారం కాలనీని సందర్శించారు. పిచ్చిమొక్కలు తొలగించాలని ఆదేశాలిచ్చారు. కాలనీవాసుల సమక్షంలోనే మున్సిపల్ సిబ్బంది పనులు పూర్తి చేశారు. అలాగే పలు కాలనీల్లో మురికికాల్వలు ధ్వంసమయ్యాయని వచ్చిన ఫిర్యాదులపై స్పందించి డ్రైనేజీలు దెబ్బతిన్న చోట జేసీబీలతో కొత్త పైపులను వేయించారు. పిచ్చిమొక్కల తొలగింపును చాలాచోట్ల చేపట్టారు. పనులను కమిషనర్ స్వయంగా పర్యవేక్షించారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి బాటలు వేసిన 'సాక్షి'కి ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్, మోదీ ఫ్లెక్సీల దహనం



సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలో రేవంత్, మోదీ ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

సిద్దిపేటకమాన్: రెండు జాతీయ పార్టీలు సాధించింది తెలంగాణకు గుండు సున్నా అని బీఆర్‌ఎస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగాల నాయకులు రజనీకాంత్‌రెడ్డి, యాదగిరి ఆరోపించారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్‌ఎస్‌వీ నాయకులు సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలో వినూత్నంగా నిరసన తెలిపారు. గాడిద గుడ్డు, గుండు సున్నాలున్న సీఎం రేవంత్, ప్రధాని మోదీ ఫ్లెక్సీలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణకు రూపాయి దక్కాలన్నా అది కేసీఆర్ వల్లే సాధ్యమన్నారు. ఈ వాస్తవాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఎనిమిది మంది చొప్పున ఉన్నా తెలంగాణకు వచ్చిన నిధులు సున్నా అని అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి యువజన విభాగ నాయకులు రాజశేఖర్, నవీన్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టాలి
- జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్



ములుగు పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

ములుగు(గజ్వేల్): వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదముందని ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల పనితీరుపై, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై ఆరోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత లోపించడం, నీరు కలుషితం కావడం, దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. అందుకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో రాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఫీవర్ సర్వే నిర్వహించాలని, జ్వరంతో బాధపడే వారిని గుర్తించి రక్త నమూనాలను సేకరించి చికిత్స అందించాలన్నారు. అవసరమైతే గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, వైద్యాధికారి అఖిల, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల రెన్యువల్‌ను వేగిరం చేయండి

- కలెక్టర్ మనుచౌదరి
- ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులను సందర్శించిన కలెక్టర్



బ్యాంకులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటకమాన్: ప్రతి బ్యాంకులో రుణాల రెన్యువల్‌ను వేగిరం చేయాలని కలెక్టర్ మనుచౌదరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. సిద్దిపేట పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ వ్యవసాయ, వాణిజ్య బ్యాంకు బ్రాంచ్‌లను కలెక్టర్ బుధవారం సందర్శించారు. రైతుల రుణ మాఫీ, రుణాల రెన్యువల్ ప్రక్రియను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంతమందికి పంట రుణాలు రీషెడ్యూల్ చేస్తున్నారని, పంట రుణ మాఫీలో ఎక్కడైనా సమస్య ఉందా? ఉంటే ఎలా పరిష్కరిస్తున్నారు? వ్యవసాయశాఖ అధికారులతో సమన్వయం చేస్తున్నారా? అని బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. రూ.లక్ష లోపు విడుదలైన రైతు రుణ మాఫీ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి ఈ నెలఖారులోగా ఆయా రైతులకు కొత్త రుణాలను అందించాలన్నారు. ప్రతి బ్యాంకులో రోజుకు 100 రుణాలు రెన్యువల్ చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబును ఆదేశించారు.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోండి

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. బుధవారం రూరల్ మండల ఎంపీడీఓ కార్యాలయాన్ని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు అందిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే విధానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ ఎక్కడ జరుగుతుందో అక్కడ బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయంలో ప్రజాపాలన బ్యానర్ కనబడకపోవడంతో ఎంపీడీఓ రాఘవేందర్ రెడ్డిపై మండిపడ్డారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

డీపీఓ దేవకీదేవీ

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ దేవకీదేవి, డీఎల్‌పీఓ మల్లికార్జున్ సూచించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌ను బుధవారం సందర్శించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్య వర్షపు నీరు నిలువ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. నిలువ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జిల్లాలో ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత పాటించడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, మండల పంచాయతీ ఆఫీసర్ జహూరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి ఫహీం, భూంపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనాథల ఆలనా, పాలనా మీదే

బాలసదనం, శిశుగృహంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



చిన్నారి లాస్యను ఎత్తుకొని లాలిస్తున్న కలెక్టర్

సిద్దిపేటజోన్: 'విధి వక్రించి అనాథలైన పిల్లలకు మీరు దేవుడిచ్చిన అమ్మలు.. ఇక్కడ ఉండే పిల్లల ఆలనా, పాలనా బాధ్యత మీదే. తల్లి ప్రేమను పంచాలి'అని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. బుధవారం స్థానిక బాలసదనం, శిశుగృహ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిశుగృహంలో పిల్లల సంఖ్య గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలు లేని వారికి ఇప్పటివరకు ఎంత మందికి దత్తత ఇచ్చారని ఆరా తీశారు. ఉయ్యాలలో ఉన్న 4 నెలల పసిపాప (లాస్య)వివరాలు తెలుసుకున్నారు. చిన్నారిని ఎత్తుకుని లాలించారు. చాలా క్యూట్‌గా ఉందంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని వారు కలెక్టర్ దృష్టికి తేగా వెంటనే స్పందించి త్వరితగతిన టాయిలెట్స్ నిర్మాణం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బాల సదనం సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి శారద, బాలల సంరక్షణ శాఖ అధికారి రాము, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి అదృశ్యం


నర్సవ్వ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): మతిస్థిమితం తప్పిన వృద్ధురాలు ఇంటి నుంచి తప్పిపోయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. మద్దూరు మండలం రేబర్తికి చెందిన గొట్టం నర్సవ్వ (65) బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె కుమారుడు గొట్టం భూపతిరెడ్డి తెలిపారు. గొట్టం నర్సవ్వ ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని భూపతిరెడ్డి (99120–34975) తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలవుతున్న విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, పుస్తకాలు, బెడ్ షీట్స్ ఇవ్వలేదన్నారు. విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొండా సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ (ఏ)లోకి చేర్చాలి


దుబ్బాక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ముదిరాజులు

దుబ్బాక: ముదిరాజులను బీసీ (డి) నుంచి (ఏ)లోకి చేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజు మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనకయ్య, దుబ్బాక ముదిరాజు సంఘం అధ్యక్షుడు మాడబోయిన రాజు, జిల్లా నాయకుడు దేవుని రాజు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముదిరాజులను బీసీ (ఏ)లోకి చేరుస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్స రవీందర్, నర్సింహులు, మల్లయ్య, బాల్‌నర్సయ్య, రాజేష్, తోట్ల మల్లయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

భవనాలు నిర్మించాలి

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకర్ బాబు


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

హుస్నాబాద్: అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీ విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానం అలంబిస్తోందన్నారు. ఆరు గ్యారంటీల్లో ప్రతీ మండలంలో ఎస్సీ గురుకుల రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులిలా.. వరదొస్తే ఎలా?


పాపన్నపేట : కూలిన ఫతేనహర్ గైడ్ వాల్

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు ఈ యేడు వర్షాకాల మరమ్మతులకు నోచుకోలేదు. ఈ ప్రాజెక్టుల పరిధిలో తూముల నిర్వహణ సరిగా లేదని రైతులు చెబుతున్నారు. కెనాల్ వద్ద గండ్లు పడ్డాయని, సాగునీటి కోసం కట్ట పనులు చేపట్టడం లేదని, గైడ్‌వాల్, తదితర పనులు అసంపూర్తిగానే ఉన్నాయని విమర్శిస్తున్నారు. ఇంకా కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, గైడ్‌వాల్ నుంచి పడిపోయిన రాళ్లు కాల్వల్లోనే ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నిస్తున్నారు. వరదలొస్తే పంటల పరిస్థితి ఏమిటి? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘణపురానికి వీడని గ్రహణం

రూ.55.32 కోట్లు మంజూరైనా.. పూర్తి కాని పనులు

పాపన్నపేట(మెదక్): దేవుడు వర మిచ్చినా.. పూజారి కనికరించలేదన్నట్లుంది ఘనపురం ప్రాజెక్టు పరిస్థితి. జిల్లాలోని ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు కింద మహబూబ్ నహర్, ఫతేనహర్ కెనాళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు నిల్వ నీటి సామర్థ్యం 0.2 టీఎంసీలు. ప్రస్తుతం పూడికకు గురి కావడంతో 0.134 టీఎంసీలకు పడిపోయింది. నిర్దేశిత ఆయకట్టు 23,125 ఎకరాలు ఉన్నా మంజీరా తీర ప్రాంత పొలాలతో కలిసి సుమారు 30 వేల ఎకరాలు సాగు అవుతోంది. 120 ఏళ్ల చరిత్ర గల ప్రాజెక్టుకు తొలిసారి ఆధునీకరణ కోసం 2022లో రూ.55.32 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు దాదాపు రూ.20 కోట్ల పనులు పూర్తి అయ్యాయి. మహబూబ్‌నహర్ కెనాల్ పనులు పూర్తి అయినా ఫతేనహర్ కెనాల్ వైపు అబ్లాపూర్, అన్నారం, కుర్తివాడ, దౌలాపూర్, మిన్‌పూర్ కాలువలకు లైనింగ్, గైడ్‌వాల్స్, తూముల రిపేర్లు జరగాల్సి ఉంది. 2011లో జైకా పథకం కింద మంజూరైన రూ.24.08 కోట్ల పనులు పూర్తి అయినా పదేళ్లలోనే అవి శిథిలమవుతున్నాయి. దీంతో గైడ్‌వాల్ రాళ్లు కాల్వల్లో పడి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. నాగ్సాన్‌పల్లి ప్రధాన కాలువ లోతుగా ఉంది. అది పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కనీసం నీటి ప్రవాహం కూడా కనిపించని పరిస్థితి. తూములు సరిగా లేక నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. మిన్‌పూర్ నుంచి కుర్తివాడ కోమటి చెరువు వరకు కెనాల్‌కు మూడు చోట్ల గండ్లు ఉన్నట్లు రైతులు వాపోయారు. చివరి ఆయకట్టు రైతులు అనాదిగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చినా మరమ్మతులు పూర్తి కాలేదు. తాత్కాలిక మరమ్మతుల కోసం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేరు.


నాగ్సాన్‌పల్లి గుట్ట వద్ద ఫతేనహర్ కెనాల్ లో పిచ్చి మొక్కలు

> **అత్యవసరమైన చోట మరమ్మతులు**
>
> ఘణపురం ఆనకట్ట ఆధునీకరణ కోసం మంజూరైన నిధుల నుంచి సుమారు 50 శాతం పనులు ఎంఎన్ కెనాల్ వైపు పూర్తి కాగా, ఎఫ్ఎన్ కెనాల్ వైపు మిగిలిపోయాయి. వర్షాకాలం ఆరంభం కావడంతో పూర్తి చేయలేక పోయాం. అత్యవసరమైన చోట మరమ్మతులు చేపడుతాం.
>
> – శివనాగరాజు, డీఈఈ, ఇరిగేషన్

'నారింజ'కు.. నిధులు కరువు

రూ.3.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు


నారింజ ప్రాజెక్టు

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి) గ్రామశివారులో గల నారింజ ప్రాజెక్టు మరమ్మతుకు నిధుల కేటాయింపుల్లో జాప్యం జరుగుతోంది. రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. తాజాగా పక్షం రోజుల క్రితం నీటి పారుదల శాఖ అధికారులు రూ.3.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదించారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ప్రాజెక్టు షట్టర్లను మార్చాల్సి ఉంది. వాటిని ఎత్తేందుకు వీలుగా ఉన్న జనరేటర్ సైతం మరమ్మతులకు వచ్చింది. ప్రాజెక్టు చుట్ట కట్ట ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. ఆయకట్టుకు నీటిని అందించే తూములు, అలుగు మరమ్మతులు అవసరం ఉంది. నీటి సాగు కోసం కట్ట కాలువ నిర్మాణం చేయాల్సి ఉంది. యాంత్రిక మరమ్మతులు, ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు ఆయకట్టుకు నీటిని అందించలేకుండా ఉంది. 0.85 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం కలిగి ఉన్న ప్రాజెక్టు ప్రస్తుతం పరిసర గ్రామాల్లో నీటి ఊటలు పెంచేందుకు మాత్రమే ఉపయోగపడుతోంది.

తూము నుంచి నీరు వృథా



వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని కుడిచెరువు తూము నుంచి నీరు వృథాగా పోతోంది. దాని పక్కనే ఏర్పడిన గండి వల్ల సుమారు రెండేళ్లుగా నీరు కిందకు పోతోంది. నీటి వృథాతో చెరువుకట్టకు ప్రమాదం పొంచి ఉంది. ఆయకట్టు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మరమ్మతులు చేపట్టాలని గతంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు సమస్యను పలుమార్లు లేవనెత్తినా సమస్య నేటికీ పరిష్కారానికి నోచలేదు.

> **ఏజెన్సీ లేకపోవడం వల్లే..**
>
> కుడిచెరువు తూము మరమ్మతు పనులను చేపట్టడానికి ఏజెన్సీ లేకపోవడం వల్లే కొంత జాప్యం జరిగింది. పనులు చేపట్టడానికి మాజీ ప్రజాప్రతినిధులు ముందుకు రాలేదు. త్వరలో పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. మరమ్మతు పనులకు సంబంధించి నిధుల విడుదలకు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.
>
> – రాజేందర్, ఇరిగేషన్, డీఈ

నల్లవాగు.. కట్టపై పగుళ్లు..

కల్హేర్(నారాయణఖేడ్): ఉమ్మడి మెదక్ జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద రైతులకు కష్టాలు తీరడం లేదు. ప్రాజెక్టు కట్టపై పగుళ్లు ఏర్పడ్డాయి. మరమ్మతుకు నోచడం లేదు. సమైక్యాంధ్ర పాలనలో నాటి ప్రభుత్వం నల్లవాగు కాల్వల సీసీ లైనింగ్ కోసం రూ. 14 కోట్లు మంజూరు చేసింది. పనుల నాణ్యత లేకపోవడంతో కాల్వల పరిస్థితి అధ్వానంగా తయారైంది. తెలంగాణ వచ్చాక 2017లో ప్రభుత్వం రూ. 24.14 కోట్లు మంజూరు చేసింది. ఆధునీకరణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆయకట్టు రైతుల కష్టాలు ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఎమ్మెల్యే సంజీవరెడ్డి చొరవతో ఇటీవలే కాంట్రాక్టర్ తిరిగి పనులు ప్రారంభించారు. కాల్వల సీసీ లైనింగ్ పనులు చేపట్టారు. గైడ్‌వాల్, తదితర పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. గైడ్‌వాల్ నుంచి పడిపోయిన రాళ్లు కాల్వల్లోనే ఉన్నాయి.


నల్లవాగు ప్రాజెక్టు గైడ్‌వాల్‌కు ఏర్పడిన పగుళ్లు

9, 10 గేట్‌ల పనులు

పుల్‌కల్(అందోల్): వరదలను తట్టు కోవడానికి డ్యామ్ పటిష్టత కోసం సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడుతున్నారు. క్రస్ట్‌గేట్‌ల రబ్బర్ గ్రీజింగ్ కోసం రూ. 15 లక్షలు వెచ్చించి పనులు చేస్తున్నారు. ఏటా 17 క్రస్టుగేట్‌ల గ్రీజింగ్ చేయించి మరమ్మతు చేస్తారు. ఈ సీజన్‌లో 9, 10 గేట్‌లను ఎంపిక చేసి క్రస్టు గేట్‌లకు, వాటి ఎత్తు రూప్‌లకు మరమ్మతు చేస్తున్నారు. సీజన్ మరమ్మతుల కోసం రూ.15 లక్షలను కేటాయించారు. డ్యాం వద్ద యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నారు. మట్టి కట్టపై నున్న పిచ్చి మొక్కలను వేసవిలో తొలగించారు. దీంతో గేట్‌ల నుంచి నీరు లీకేజీ కాకుండా నివారిస్తారు.


గేట్‌ల రూప్‌లకు మరమ్మతు చేస్తున్న సాంకేతిక నిపుణుడు

డ్రగ్స్ నియంత్రణకు నిఘా ముమ్మరం


మొక్క నాటుతున్న సీపీ అనురాధ

బెజ్జంకి(సిద్దిపేట): గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు రవాణా కాకుండా నిఘా పటిష్టంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశించారు. బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కేసులో పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. పోలీసులు గ్రామాల్లో తరుచూ పర్యటించి విషయాలు తెలుసుకోవాలన్నారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతులకు నేను సైతంలో వ్యాపారులు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి పోలీసులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో మొక్క నాటారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, రూరల్ సీఐ శ్రీనివాస్, సీసీ ఆర్బీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటీసెల్ ఎస్ఐ నరేందర్, బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలకు ఆదేశం



దుబ్బాక: కూడవెల్లి వాగు ప్రవహిస్తున్నందున తొగుట మండలం చందాపూర్ మొండిమత్తడి నుంచి ఫీడర్ ఛానల్ ద్వారా జప్తిలింగారెడ్డిపల్లి తుంగచెరువులోకి నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కూడవెల్లి వాగు ప్రవహిస్తున్నా తుంగచెరువులోకి నీరు వదలలేదని బుధవారం సాయంత్రం రైతులు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ ద్వారా విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ ఈఈ సాయిబాబాకు ఫోన్ చేసి మాట్లాడారు. కూడవెల్లి వాగుపై చందాపూర్ వద్ద చెక్‌డ్యాం పొంగిపొర్లుతున్నా ఎందుకు తుంగచెరువులోకి నీరు విడుదల చేయలేదని ప్రశ్నించారు. గురువారం ఉదయం వెళ్లి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



కుకునూరుపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పొల్కంపల్లి నరేందర్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు, సర్పంచ్ జయంతి భర్త పొల్కంపల్లి నరేందర్ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో బదిలీలు సహజమన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు షాదుల్లా బాబా, కృష్ణవేణి, అనురాధ, రజిత, స్వామి, నరేష్, అజీజ్, పదోన్నతపొందిన రాము తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్తయ్య, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య, నాయకులు పాల్గొన్నారు.

హరిత సిద్దిపేట మన లక్ష్యం

సిద్దిపేటజోన్: హరిత సిద్దిపేట లక్ష్యంగా ప్రజలు మొక్కలు నాటే బాధ్యత చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి పిలుపు ఇచ్చారు. బుధవారం కోమటిచెర్వు–నెక్లెస్ రోడ్డును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని పూల మొక్కలు నాటారు. సిద్దిపేట పచ్చదనంతో విలసిల్లుతోందని, దానిని కాపాడే బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోమటిచెర్వులో చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుద్ధి చేయాలన్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్స్‌పెక్టర్ మాధవి, డాక్టర్ స్వామి తదితరులు ఉన్నారు.

భూంపల్లిలో శిక్షా సప్తాహ్ స్పోర్ట్స్ డే

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. విద్యార్థులు అబ్బురపరిచే విన్యాసాలతో ఆకట్టుకున్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేందర్, టీచర్లు దయాసాగర్ రెడ్డి, స్వామి, రాజశ్రీ, సంతోషి, మేఘమాల, పీఈటీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపేందర్ గుప్తాకు అవార్డు


అవార్డు అందుకుంటున్న ఉపేందర్ గుప్తా

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని రేబర్తి గ్రామానికి చెందిన సామాజిక వేత్త, ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీ, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా కోడిరామకృష్ణ ఫిలిం అవార్డు–2024ను అందుకున్నట్లు మద్దూరు మండల ఆర్యవైశ్య సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన కోడి రామకృష్ణ ఫిలిం అవార్డ్స్–2024 కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, సినీ నటులు సుమన్, మురళీమోహన్, కవిత, వాణి తదితరుల చేతుల మీదుగా ఉపేందర్ గుప్తా అవార్డు అందుకున్నట్లు చెప్పారు.

నిందితుడి రిమాండ్

నంగునూర్ (సిద్దిపేట): గొడవ విషయంలో కేసు నమోదైన నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయినందున పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం నంగునూర్‌కు చెందిన కొమురయ్య, రవీందర్ మధ్య గతంలో జరిగిన గొడవ విషయంపై కేసు నమోదు అయింది. నిందితుడు కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది.

తెలంగాణపై కేంద్రం వివక్ష

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై మోదీ ప్రభుత్వం వివక్ష చూపిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ ఆరోపించారు. బుధవారం చిన్నకోడూరులో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాల్సిన కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను మాత్రమే కాపాడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో రెండు రాష్ట్రాల్లో వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయించాల్సి ఉన్నా, తెలంగాణ జిల్లాలకు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్న ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదన్నారు. గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్యాయంపై నిలదీయాలి

సిద్దిపేటజోన్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై తెలంగాణ రాష్ట్ర ఎంపీలు పార్లమెంట్‌లో నిలదీయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ పార్టీ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

అంగడి నిర్వహణకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌తోపాటు ప్రమాదాల నివారణకు అంగడిని రెండు ప్రాంతాల్లో నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం జరిగే అంగడిని మార్చేందుకు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, గజ్వేల్ సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి, మార్కెట్ సెక్రటరీ జాన్‌వెస్లీ పట్టణంలోని సంగాపూర్ మార్గంలోగల ఐసీడీఎస్ గోదాం పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందుకు అంగడిని రెండు ప్రాంతాల్లో నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటడం పూర్తి చేయండి

డీఆర్డీఓ జయదేవ్ ఆర్య


అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న డీఆర్డీఓ జయదేవ్ ఆర్య

అక్కన్నపేట(హుస్నాబాద్): 95 వేల మొక్కలు నాటే ప్రక్రియ శనివారం నాటికి పూర్తి చేయాలని జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) జయదేవ్ ఆర్య అన్నారు. అక్కన్నపేట ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్(టీఏలు), ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వనమహోత్సంలో మండలంలో 66 వేల మొక్కలు నాటడం సంతోషకరమన్నారు. ప్రతీ ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని ఎంపీడీఓ జయరాంను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ కవికుమార్, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కేంద్ర బృందం పర్యటన

మద్దూరు(హుస్నాబాద్): వన మహోత్సవంలో భాగంగా మద్దూరు మండలంలో 70 వేల మొక్కలను నాటే విధంగా అధికారులు, ప్రజలు చొరవ చూపాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని సలాఖపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని నర్సరీని పరిశీలించి, శ్మాశనవాటిక వద్ద మొక్కలు నాటారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు గాను త్వరలో కేంద్ర బృందం రానున్నందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, కార్యదర్శులు పాల్గొన్నారు.